

28న మిక్సిడ్ రైస్ టెండర్ కమ్ వేలం

ప్రజాశక్తి- తిరుపతిసిటీ: తిరుమల శ్రీవారి ఆలయంతోపాటు ఇతర అనుబంధ ఆలయాలకు హుండి ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన బియ్యం జూన్ 28వ తేదీన టెండర్ కమ్ వేలం వేయనున్నారు. ఇందులో మిక్సిడ్ బియ్యం 13,080 కేజిలు టెండర్ మరియు వేలంలో ఉంచనున్నారు. ఆసక్తి గలవారు ఈనెల 28వ తేదీలోపు కార్యనిర్వహణాధికారి, టీటీడీ పేరిట రూ.25వేలు, ఈఎండి, సీల్డ్ టెండర్‌తోపాటు తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం, జనరల్ మేనేజర్ (వేలం) కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. అదేరోజు సాయంత్రం టెండర్లను తెరవడం జరుగుతుంది. ఇతర వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877- 2264429, నంబర్లలో కార్యాలయం వేళల్లో సంప్రదించవచ్చు అని, టీటీడీ వెబ్‌సైట్‌ద్వారా వివరాలు తెలుసుకోవచ్చు తెలిపారు.

లేబర్ కోడ్‌ల పేరుతో..

కార్మిక చట్టాల హరణ

మోడీ ప్రతిపాదనలకు జగన్ హుజూర్ - సిఐటియు అఖిలభారత కార్యదర్శి కరిమలయన్



వేదికపై మాట్లాడుతున్న సిఐటియు అఖిలభారత కార్యదర్శి కరిమలయన్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: దేశంలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయటానికి మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను ప్రతిపాదించిందని, వీటి అమలుకు జగన్ ప్రభుత్వం తహతహలాడుతోందని సిఐటియు అఖిలభారత కార్యదర్శి కరిమలయన్ అన్నారు. సిఐటియు రాష్ట్ర తరగతులలో రెండవ రోజు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని లేబర్ కోడ్‌లు, కార్మిక వర్గంపై ప్రభావం అనే అంశంపై ప్రసంగించారు. స్థానిక న్యూబాలాజీ కాలనీలో సిఐటియు తరగతులకు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కరిమలయన్ మాట్లాడుతూ అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం కలిగించేందుకు సంఘటిత రంగంలోని కార్మికోద్యమాలను బలహీనపరిచేందుకు ఒక పథకం ప్రకారం మోడీ ప్రభుత్వం కార్మికచట్టాలను నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు. జాతీయోద్యమ వారసత్వంతో అనేక పోరాటాల ఫలితంగా ఏర్పరచుకున్న కార్మిక చట్టాలను ఒక కలం పోటుతో బలహీనపరచాలని మోడీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఈ ప్రతిపాదనలను వ్యతిరేకించాల్సిన రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని బలపరచటం శోచనీయమని అన్నారు. ఏపీలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మోడీ విధానాలను బలపరచడంలో ముందు పీఠిన ఉందని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో సిఐటియు ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు చేపట్టాలని ఐక్య కార్మిక ఉద్యమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్నం సిఐటియు ఉద్యమం విస్తరణ అనే అంశంపై సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ప్రసంగించారు. రాష్ట్రంలో సీఐటీయు బలపడడం ద్వారా కార్మికోద్యమాలను తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని ఈ వైఖరిని సిఐటియు రాష్ట్రంలో సమర్థవంతంగా ఎదుర్కొంటున్నదని గుర్తు చేశారు. స్కీం వర్కర్లపై టీటీడీ కాంట్రాక్టు కార్మికులపై విశాఖ ఉక్కు ఉద్యమంపై అదేపనిగా దుష్ప్రచారానికి పాల్పడుతూ దాడులకు పాల్పడటాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. రానున్న కాలంలో మరిన్ని ఉద్యమాలు చేపట్టాలని మిలిటెంట్ పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

శిక్షణా తరగుతుల్లో సిఐటియు ప్రతినిధులు



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

పాల లారీని ఢీకొన్న టెంపో..

ఐదుగురు దుర్మరణం


ప్రమాదంలో ధ్వంసమైన టెంపో, ఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహాలు

ఏడుగురికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి- పుత్తూరుటౌన్: వడమాలపేట మండలం, ఎస్‌విపురం టోల్‌ప్లాజా వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. పుత్తూరు సిఐ సురేష్ కుమార్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం పుత్తూరులోని అంజేరమ్మ ఆలయానికి తిరుపతి నుంచి టెంపో వాహనంలో అమ్మవారి భక్తులు దర్శనార్థం వస్తుండగా టోల్ ప్లాజా నుంచి జాతీయ రహదారిలో వస్తున్న పాలడెయిరీని టిటిసి ట్రావెల్స్‌కు చెందిన టెంపో డ్రైవర్ నిర్లక్ష్యంగా రాంగ్‌రూట్‌లో తోలడం ఎదురుగా వస్తున్న పాల లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో పాల డెయిరీకి చెందిన వ్యాన్ డ్రైవర్ కె.శివకుమార్ (63), తిరుపతికి చెందిన గోపాలరాజకాలనీకి చెందిన గిరిజమ్మ (48), ఐరాల మండలం కలికిరి వారిపల్లికి చెందిన పి.రేవంత్ కుమార్ (26) అక్కడికక్కడే మరణించారు. కుప్పం మండలంకు చెందిన పిపి. అజయ్‌కుమార్ (25), పాకాల మండలం సిరామాపురంకి రేఖ(24) తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. క్షతగ్రాతులను రుయాకు తరలించగా చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు.

మొదటి ఘాట్‌లో టెంపో బోల్తా

భక్తులకు స్వల్ప గాయాలు

తిరుమల ఘాట్‌లో ప్రమాదాలకు అడ్డుకట్టపడటం లేదు. శ్రీవారి దర్శనార్థం వస్తున్న భక్తులు క్షతగాత్రులుగా వెళుతున్నారు. ఇటీవల ఓటెంపో బోల్తాపడి దాదాపు 12మంది గాయాలపాలైన ఘటన మరువకముందే ఆదివారం మరో టెంపో బోల్తాపడింది. ఈఘటనలో ఐదుగురు భక్తులు గాయపడ్డారు. చెన్నైకి చెందిన 12మందితో కూడిన భక్తబృందం శ్రీవారిని దర్శించుకునేందుకు టెంపో ట్రావెలర్ వాహనంలో శనివారం ఉదయం తిరుమలకు వచ్చారు. దర్శనం పూర్తిచేసుకుని ఆదివారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. ఈక్రమంలో మొదటి ఘాట్‌లోని నాల్గోమలుపు వద్ద వాహనం ఒక్కసారిగా అదుపుతప్పి రక్షణగోడను ఢీకొంది. వేగం అదుపుకాకపోవడంతో బోల్తాపడింది.

పదో మలుపు వద్ద మరో ప్రమాదం

మొదటిఘాట్‌లో టెంపో బోల్తాపడిన గంట వ్యవధిలోని పదో మలుపు వద్ద మరో టెంపో అదుపుతప్పి రక్షణ గోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన 10మంది భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. ఈ రెండు ఘటనలు బ్రేక్ ఫెయిల్ కావడంతో జరిగినట్టు డ్రైవర్లు తెలిపారు. ఇటీవల కాలంలో టెంపో వాహనాలే అధికంగా ప్రమాదాలకు గురవుతుండటం గమనార్హం.

తిరుమల ఘాట్‌లో బోల్తా పడిన టెంపో

పండుగ వాతావరణంలో

జగనన్న విద్యా కానుక పంపిణీ

కలెక్టర్ వెంకట రమణారెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: జిల్లాలో పాఠశాలల పునఃప్రారంభం ఈనెల 12న సోమవారం జగనన్న విద్యాకానుక పంపిణీ పండుగ వాతావరణంలో జరగాలని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణా రెడ్డి విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లాలో విద్యా కానుక పంపిణీ చేపట్టనున్నారని తెలిపారు. జిల్లాలో మండల విద్యాశాఖాధికారులు వారి పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యాకానుక కిట్ల పంపిణీకి ప్రజాప్రతినిధులు, పిల్లల తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలన్నారు. ఇప్పటికే క్వాలిటీ చెక్ జరిగిందని, నాణ్యతలేని, డ్యామేజ్డ్, మిస్ మ్యాచ్, డిఫెక్టివ్ వస్తువులను పంపిణీ చేయరాదని అన్నారు. పంపిణీ సమయంలో లోపాలుంటే వాటి స్థానంలో కొత్తవి పంపిణీ చేసేలా చూడాలన్నారు. జిల్లాకు అందిన విద్యాకానుక వస్తువులు ఒకటవ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు 1,66,659 మందికి మూడు జతల యూనిఫామ్, 1 నుండి 5వ తరగతి ఆడపిల్లలకు, 1 నుండి 10 తరగతి మగపిల్లలకు కలిపి 121648 మందికి బెల్టులు, 1వ తరగతి విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీలు 13957, 6వ తరగతి విద్యార్థులకు డిక్షనరీలు 19380, 6 నుండి 10 తరగతి వారికి నోట్‌పుస్తకాలు 945828, ఒకటవ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులు 1,66, 659 మందికి షూలు, సాక్సులు, 1 నుండి 5వ తరగతి విద్యార్థులకు 297605 వర్క్ బుక్‌లు, 1 నుండి 10వ తరగతి విద్యార్థులకు 1192038 టెక్ట్ బుక్స్, 6,659 మందికి స్కూల్ బ్యాగుల పంపిణీ జరిగేలా చూడాలని సూచించారు.

నేషనల్ హెల్త్ మిషన్

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న జేపీసీ నాయకులు

సమావేశానికి హాజరైన నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్టు ఉద్యోగుల రాయలసీమ జిల్లాలు తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, కడప జిల్లాల సమావేశం లోకేష్‌బాబు అధ్యక్షతన తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞానకేంద్రంలో జరిగింది. ఈ సమావేశానికి ఏపి నేషనల్ హెల్త్‌మిషన్ కాంట్రాక్టు ఉద్యోగుల రాష్ట్ర జేఏసీ చైర్మన్ దయామణి హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులను యథావిధిగా రెగ్యులర్ చేయాలని సమాన పనికి సమాన వేతనం మినిమం టైమ్‌స్కేల్ అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నత స్థాయి అధికారులు ఉద్యోగుల సంఘం ప్రతినిధులతో జరిపిన చర్చల్లో ఒప్పందం మేరకు నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు వేతనాలు పెంచుతూ జీవో నెంబర్ 68 విడుదల చేసిందని, అయితే వెనువెంటేనే జీతాలు తగ్గిస్తూ జీవో నెంబర్ 64ను ఇస్తూ తీవ్ర అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఉద్యోగులందరూ అసంతప్తి వ్యక్తం చేస్తున్నారని నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సమాన పనికి సమానమేతనం మినిమం టైమ్‌స్కేల్ అమలు చేయాలని కోరారు. అలాగే నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల విధులు, నిధులు రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకుంటూ సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తున్నారని నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల తీవ్రస్థాయిలో వ్యతిరేకిస్తున్నారని ఈ అంశాలపైన 14వ తారీకు జూన్ నెల ఒంగోలులో జేఏసీ రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. నేషనల్ హెల్త్‌మిషన్ రాష్ట్ర జేఏసీ గౌరవాధ్యక్షులు ఏవి నాగేశ్వరావు మాట్లాడుతూ నేషనల్ హెల్త్‌మిషన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. న్యాయమైన హక్కుల సాధన కోసం అవసరమైతే ప్రత్యక్ష పోరాటానికి ఉద్యోగులు సిద్ధంగా కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపి రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల తిరుపతి జిల్లా జేఏసీ చైర్మన్ గండికోట నాగవెంకటేష్, జిల్లా జేఏసీ చైర్మన్ మోయుద్దిన్, నాయకులు దేవరాజులు, ప్రభాకర్, నరసింహ, ఆరు జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

టాటా ఏఐఏ లైఫ్ ఫార్చ్యూన్ గ్యారెంటీ పెన్షన్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

భారతదేశంలో సుప్రసిద్ధ జీవిత బీమా కంపెనీలలో ఒకటైన టాటా ఏఐఏలైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఏఐఏ లైఫ్) ప్రతిష్టాత్మకమైన యాన్యుటీ (గ్యారెంటీడ్ ఇన్‌కమ్ ఫర్ లైఫ్) ప్లాన్ కోసం అత్యంత శక్తివంతమైన వెర్షన్ టాటా ఏఐఏ లైఫ్ ఫార్చ్యూన్ గ్యారెంటీ పెన్షన్‌ను విడుదల చేసింది. ఈ నూతన వెర్షన్‌లో అత్యంత కీలకమైన అంశాలను మెరుగు పరిచారు. వీటిలో అత్యధిక యాన్యుటీరేట్లు, మరణ ప్రయోజనాలు వంటివి ఉండటం చేత వినియోగదారులు తమ గోల్డెన్ ఇయర్స్‌లో ఆర్థికంగా స్వేచ్ఛను, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పొందగలరని టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సమిత్ ఉపాధ్యాయ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీవితకాలం పెరగడం, పొదుపు స్థాయిలు తగ్గడం వల్ల దేశంలో రిటైర్‌మెంట్ ఆదాయం ఆందోళనగా మారింది. భారతదేశంలో రిటైర్‌మెంట్ పొదుపు 2050 నాటికి 85 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని అంచనా. వినియోగదారులు కచ్చితంగా తమ రిటైర్‌మెంట్ తరువాత ఆర్థిక స్వేచ్ఛకు భరోసా కలిగి ఉండాలి. టాటా ఏఐఏ లైఫ్ ఫార్చ్యూన్ గ్యారెంటీ పెన్షన్ ప్లాన్, గ్యారెంటీడ్ ఇన్‌కమ్ అవకాశాలను అందించడంతో పాటుగా వినియోగదారులు తమ రిటైర్‌మెంట్ జీవితం కోసం తగినంతగా పొదుపు చేసుకునే అవకాశం అందిస్తుందన్నారు. భవిష్యత్ కోసం ప్రణాళికలు చేసుకునే వివాహితులు, మహిళలు, వ్యక్తులతో పాటుగా ఎస్ఎంఈ వినియోగదారులకు ఈప్లాన్ అత్యంత అనుకూలంగా ఉంటుందన్నారు. టాటా ఏఐఏ లైఫ్ ఫార్చ్యూర్ గ్యారెంటీ పెన్షన్ ప్లాన్ అత్యద్భుతమైన ఆర్థిక సాధనంగా మన లక్ష్య సాధనలో నిలుస్తుంది. ఈ ప్లాన్ మా వినియోగదారులకు వారు రిటైర్ కాకముందే తగినంతగా పొదుపు చేసుకునే అవకాశం అందిస్తుంది. జీతం ద్వారా అందుకునే ఆదాయం ఆగిన సమయంలో అది స్థిరమైన ఆదాయం అందిస్తుందని అన్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్రికెట్ విజేతగా రాయలసీమ లయన్స్

ప్రజాశక్తి- క్యాంపస్: రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పరిరక్షణలో జర్నలిజం నాలుగో స్తంభంగా నిలిచిందని, తాను పవిత్రమైన జర్నలిస్టు కావాలనుకుని ఐపిఎస్‌ను అయ్యానని డిఐజి ఆవుల రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. జర్నలిస్టు కాలేకపోయానన్న లోటు తనలో మిగిలిపోయిందని, అందుకే వారితో తనకు విడదీయరాని అనుబంధం ఏర్పడిందని చెప్పారు. ఎస్వీ యూనివర్సిటీ, వెటర్నరీ కళాశాల క్రీడా మైదానాల్లో ఆదివారం జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జోనల్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. 13 జిల్లాల నుంచి విచ్చేసిన క్రీడాజర్నలిస్టులు ఈటోర్నమెంటులో పాల్గొన్నారు. టోర్నీ ఫైనల్స్‌లో కష్ణ గోదావరి ఫైటర్స్‌తో రాయలసీమ లయన్స్ జట్టు తలపడి విజేతగా నిలిచింది. తిరుపతి వేదికగా నిర్వహించిన జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి జోనల్స్ క్రికెట్ టోర్నీలో రాయలసీమ లయన్స్ జట్టు విజేతగా నిలిచింది. బహుమతుల ప్రధానోత్సవాలకు ముఖ్యఅతిథులుగా డిఐజి ఆవుల రమేష్‌రెడ్డి, తిరుపతి అర్బన్ జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, రమాదేవి ఆసుపత్రి అధినేత డాక్టర్ డి.బి.శశిధర్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ సెక్రటరీ బాలచంద్రలు విచ్చేసి విజేతలకు బహుమతులను అందించారు. ఉదయం క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్వి యూనివర్సిటీ వైస్‌ఛాన్సర్ ప్రొఫెసర్ రాజారెడ్డి, డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, ఎస్వీయూ పిడి ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా అతిథులందరూ కొంతసేపు బ్యాటింగ్, బౌలింగ్‌తో ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా డిఐజి ఆవుల రమేష్ రెడ్డి మాట్లాడుతూ నిత్యం పని భక్తుడులో ఉండే జర్నలిస్టులు ఫిట్నెస్‌పై దష్టి సారించాలన్నారు. ఉత్తమ జర్నలిస్టులుగా రాణించాలంటే మానసిక, శారీరక దఢత్వం కలిగి ఉండాలన్నారు. ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంటుకు 13 జిల్లాల నుంచి జర్నలిస్టులంతా ఒకే వేద పైకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, డిఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, డాక్టర్ శశిధర్ రెడ్డి లు మాట్లాడుతూ జర్నలిస్టులు ఆరోగ్యంపై దష్టి సారించాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నినాదాన్ని ఎవరు విస్మరించవద్దని సూచించారు. జర్నలిస్టులంతా తరచూ ఇలా క్రీడల్లో కలవడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షులు రత్నాకర్, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కష్ణంరాజు, కార్యదర్శి ఎం శివశంకర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పులిగోరు శ్రీనివాసులు, నెల్లూరు శ్రీనివాసులు, ట్రెజరర్ సుబ్రహ్మణ్యం, మేనేజర్ విజయ్, రాష్ట్ర, జిల్లా కమిటీసభ్యులు, క్రీడజర్నలిస్టులు ఎ. సుదర్శనరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

జర్నలిస్టు అవ్వాలనుకొని ఐపిఎస్ అయ్యా

ఫిట్‌నెస్‌పై దృష్టి సారించండి

కలంతో నిజాలు రాయండి

సమాజ పరిరక్షకులు కండి : డిఐజి

టోర్నీ విజేత రాయలసీమ లయన్స్

జెసాబ్ రాష్ట్రస్థాయి జోనల్స్ క్రికెట్ టోర్నీ విజేతగా రాయలసీమ లయన్స్ జట్టు నిలిచింది. ముందుగా కోస్తా టైగర్స్ జట్టుపై రాయలసీమ లయన్స్ గెలిచి ఫైనల్స్‌కి చేరుకుంది. అలానే ఉత్తరాంధ్ర వారియర్స్‌పై కష్ణా గోదావరి (కేజిఎఫ్) ఫైటర్స్ గెలిచి ఫైనల్‌కు చేరుకుంది. ఫైనల్స్‌లో కేజిఎఫ్ ఫైటర్స్‌తో తలపడ్డ రాయలసీమ లయన్స్ ఘనవిజయం సాధించి విన్నర్గా టోర్నీ కప్పును గెలుచుకుంది.

ప్రతిభ కనబరిచిన

పోలీస్ సిబ్బంది పిల్లలకు మెరిట్ స్కాలర్షిప్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

2023 సంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ 2023 పరీక్షల ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ శాఖ సిబ్బంది పిల్లలకు సుమారు 104 మందికి మెరిట్ స్కాలర్షిప్‌లను జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి అందజేశారు. స్థానిక రామతులసి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మెరిట్ స్కాలర్షిప్‌లు సాధించిన విద్యార్థులందరినీ అభినందించారు. భవిష్యత్తులో వారు సాధించాల్సిన లక్ష్యాలను గురించి, ఒక వ్యక్తిగా వారు ఖచ్చితంగా నిర్వర్తించవలసిన బాధ్యతలను గుర్తు చేశారు. ప్రతి ఒక్కరిలో పైకి రావాలి, ఉన్నత చదువు చదివి మంచి స్థాయికి వెళ్లాలనే కోరిక తపన వారిలో బలమైన ఆలోచన చదువు పట్ల ఆసక్తిని చూపుతుందన్నారు. చదువు ఒక్కటే కాదు మంచి నడవడిక క్రమశిక్షణ కూడా చాలా అవసరమని, దీనితోపాటు చెడు వ్యసనాలకు బానిస కాకుండా కన్న కళలను సార్థకం చేసుకోవాలన్నారు. అలాగే మన నడవడిక చదువుతోపాటు భావితరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఇటీవల కాలంలో పోలీస్ సిబ్బంది పిల్లలు అన్ని రంగాలలో నైపుణ్యాలను సాధించి, చాలా రంగాలలో ఉన్నత స్థాయిలను అధిరోహించడం చాలా శుభ పరిణామమని అన్నారు. ఈ మెరిట్ స్కాలర్షిప్ ప్రధానోత్సవానికి పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహించుటకు విశేష కషి చేసిన తిరుపతి పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, సంఘం సభ్యులకు ఎస్పీ అభినందనలు తెలియజేశారు. డోనార్ డాలర్స్ గ్రూప్ అధినేత దివాకర్ రెడ్డి మాట్లాడుతూ పోలీసులంటే తనకు ఎంతో గౌరవం, దేశమంతటా ఈనాడు సంతోషకరమైన వాతావరణం ఉందంటే అది పోలీసు వల్లే సాధ్యమని, అలాంటి గొప్ప సేవ చేసే పోలీస్ పిల్లలకు నా వంతు ఒక పౌరుడిగా ఈ చిన్న సహకారాన్ని చేయడం నాకు చాలా ఆనందంగా ఉందని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక కార్యక్రమాలకు పెద్దపీట వేస్తానని ఇదే స్ఫూర్తితో పెద్దల ఆశీస్సులతో ముందుకు వెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డాలర్స్ గ్రూప్ అధినేత దివాకర్ రెడ్డి, అదనపు ఎస్పీలు అడ్మిన్ వెంకట్రావు, ఎల్ అండ్ ఓ కులశేఖర్, క్రైమ్ విమల కుమారి, తిరుపతి డిఎస్పిలు దిశ కాటమరాజు, సురేందర్ రెడ్డి, యశ్వంత్, లక్ష్మీనారాయణ హోంగార్డ్స్, పోలీస్ అధికారుల సంఘం సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన మల్టీ ట్రేడ్ ఎక్స్‌పో

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ తిరుపతి ఛాప్టర్, జైకం సంయుక్తంగా నిర్వహిస్తున్న మల్టీట్రేడ్ ఎక్స్‌పో- 2023 ఆదివారం ముగిసింది. శిల్పారామంలో రెండు రోజులు నిర్వహించిన ఈ ఎక్స్పోలో దాదాపు 100 స్టాల్స్ వివిధ వ్యాపార సంస్థలకి సంబంధించి వారి ప్రోడక్ట్‌ని ప్రమోట్ చేయడం జరిగింది. ఇందులో లక్కీ డిప్పు, ఒక రూపాయికే రక్త పరీక్షలు పరీక్షలు నిర్వహించడం తదితర సేవలు అందించడం జరిగింది. ముఖ్య అతిథులుగా ప్రముఖ సినీ నిర్మాత డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్, తిరుపతి ఫిలిం సొసైటీ ఛైర్మన్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, ఇన్చార్జి ఫిలిం సొసైటీ అధ్యక్షులు వైయస్.బాబు, జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు జెసి.గుణశేఖర్, కార్యదర్శి శేషసాయి, జైకాం ఛైర్మన్ నామా రాజేష్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ జెసి.శంకర్, ఛైర్మన్ చైతన్య తేజ్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయం చిత్తూరులో మే 8వ తేదీ నుండి జూన్ 11 వరకు వేసవి శిక్షణా శిబిరం నిర్వహించడమైనది. ఇందులో భాగంగా గ్రంథాలయంలో 25మంది విద్యార్థులుసభ్యులుగా చేరారు. ఆదివారం వేసవి శిక్షణా శిబిరంలో జాతీయ గీతంతో ముగిసినది. గ్రంథాలయాధికారులు లలిత, గజేంద్రబాబు, సుల్తానుభాను, పూర్ణిమ, సరస్వతి, శిరీష, లవకుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యుడిగా ప్రభాకర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పూతలపట్టు నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యుడుగా పూతలపట్టు ప్రభాకర్ నియమితులయ్యారు. గత 15 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక నాయకుడిగా పేరుగాంచిన పూతలపట్టు ప్రభాకర్ సేవలను పార్టీ వినియోగించుకోవాలని నిర్ణయించింది. పూతలపట్టు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసే కార్యచరణలో భాగంగా ఏడుగురు సీనియర్ నాయకులతో సమన్వయ కమిటీని పార్టీ ప్రకటించింది. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ పూతలపట్టు నియోజకవర్గం లో ప్రతి గ్రామంలో పర్యటించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మలచడానికి శక్తి వంచన లేకుండా కషి చేస్తానని హామీ ఇస్తున్నానన్నారు. ఈ పదవి బాధ్యత రావడానికి కషిచేసిన మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్ కు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతంకు, పిసిసి అధ్యక్షులు రుద్రరాజులకు కతజ్ఞతలు తెలిపారు.

ఐక్యవేదిక సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చిత్తూరు, తిరుపతి ఉమ్మడి జిల్లాల ఎస్సీ, ఎస్టీ, బీసీ, క్రిస్టియన్, మైనార్టీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని సమ్మేళన సభ ఆహ్వాన కమిటీ ఛైర్మన్ కల్లూరి నాగరాజు గౌడ్ ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరులో ఈనెల 12వ తేదీ ఆత్మీయ సమ్మేళన సభను నిర్వహిస్తున్నామని.. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మెరుగు నాగార్జున, చెల్లుబోయిన వేణుగోపాలకష్ణ, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరవుతున్నారన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ , ఎస్టీ, బీసీ, క్రిస్టియన్, మైనారిటీలు అధిక సంఖ్యలో హాజరై ఎదుర్కొంటున్న సమస్యలను తెలపాలన్నారు. సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరూ హాజరు కావాలని తెలిపారు.

నగదు ప్రోత్సాహాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఉమ్మడి జిల్లాలకు చెందిన కరణం, కరినణిగర్ కులానికి చెందిన విద్యార్థులు నగదు ప్రోత్సాహకాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కరుణిగర్ అభ్యుదయ సంఘం కార్యదర్శి రమణన్ తెలిపారు. ఎంబీబీఎస్, బీడీఎస్, అగ్రికల్చర్, బీఎస్సీ, బీటెక్, వెటర్నరీ కోర్సులు చేస్తున్న వారు ఈ నెల 20వ తేదీ లోపు కుల ధ్రువీకరణపత్రం, మార్కు లిస్టు, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డులతో స్థానిక శివజ్యోతినగర్‌లోని తమ కార్యాలయాన్ని పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 9849507843ని సంప్రదించాలని కోరారు.

ఘనంగా లారీ యూనియన్ వేడుకలు

ప్రజాశక్తి, రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని చెక్‌పోస్ట్ వద్ద రేణిగుంట లారీ సప్లయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూనియన్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి కావడంతో ఆదివారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు గణపతి రాయల్ మాట్లాడుతూ తాము రేణిగుంటలో యూనియన్ స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకోవడంతో చాలా ఆనందంగా ఉందన్నారు. యూనియన్ అభివద్ధి కోసం తమ పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని, యూనియన్‌లోని సభ్యులకు ఏ సమస్యలు వచ్చినా తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులుగా రెడ్డి ప్రకాష్, హనీఫ్, యూనియన్ వైస్ ప్రెసిడెంట్ రాము, జయ, చంద్రబాబు, సెక్రటరీలు లక్ష్మీనారాయణ, వెంకటముని, జాయింట్ సెక్రెటరీ రాజా రాయల్, కోటేశ్వరరావు, ట్రెజరర్ అరుణ్ ప్రసాద్, ఎస్కే మునీర్, సదానందం, చెల్లయ్య, కుమార్, రమేష్, మురళీ, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విద్యార్థులకు జ్ఞానం

ప్రజాశక్తి- రేణిగుంట: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడంతో విద్యార్థులకు జ్ఞానం పెరుగుతుందని రేణిగుంట సర్పంచ్ నగేష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయం వల్ల విద్యార్థులకు ఎన్నో ఉపయోగాలు ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీముఖి, విద్య వికాస వేదిక కన్వీనర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పట్టణంలోని గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి మీనాకుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖాధికారి తిరుమలరాజు పాల్గొని మాట్లాడారు. గ్రంథాలయశాఖ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని తెలిపారు. అనంతరం 35 రోజుల పాటు శిక్షణ పొందిన పిల్లలకు ఎంఈవో తిరుమలరాజు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో శంకరయ్య, సుధ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే రాళ్లు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో శ్రీనివాస తేజ ప్రైవేట్ పాఠశాల మార్గంలో రోడ్డుపైనే రాళ్లను కుప్పలుగా పడేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచి, పంచాయతీ కార్యదర్శి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని.. లేకుంటే ప్రజలు ప్రమాదాల బారిన పడనున్నారని స్థానికులు కోరుతున్నారు.

'వెలుగు'లో కమ్ముకుంటున్న చీకట్లు

- సమాఖ్య ఉద్యోగుల తీరుపై పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఫిర్యాదు
- చెక్కుల నగదు లావాదేవీలలో వెలుగు చూస్తున్న వాస్తవాలు
- ఎంపీపీ భర్త అనుచితంగా ప్రవర్తించినట్లు పేర్కొన్న వైనం
- పోలీసు దర్యాప్తులో మరోసారి వెలుగు చూడనున్న అక్రమాలు

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: వరదయ్యపాళెం మండలంలోని మహిళా వెలుగు సమాఖ్యలో అవినీతి అక్రమాలు బయటపడటంతో గతంలో సంబంధిత అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిపై శాఖా పరమైన చర్యలు చేపట్టిన విషయం అందరికి తెలిసిందే. అయితే తాజాగా వరదయ్యపాళెం మండలంలోని గోవర్ధనపురానికి చెందిన కూరపాటి నిర్మల కుమారి అనే మహిళ వెలుగు అధికారులు, సిబ్బంది అక్రమాలపై వరదయ్యపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా... ఇందిరానగర్ వెలుగు గ్రామ సమాఖ్యలో అధ్యక్షురాలిగా నిర్మల కుమారి, కార్యదర్శిగా పి.లక్ష్మి, కోశాధికారిగా వి.మౌనిక, సభ్యులు ఎంపిక చేసుకున్నారు. వీరు వీవో లీడర్లుగా వ్యవహరించారు. అయితే గతకొంతకాలానికి గ్రూపులో ఏర్పడ్డ విభేదాలు కారణంగా జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి, వీరిని వారి స్థానాల నుండి తొలగించి కొత్తవారిని ఎంపిక చేసుకుని తీర్మానం రాసుకున్నారు. ఇది జరిగి రెండు సంవత్సరాల కాలం కావస్తుంది. ఇదిలా ఉండగా ఇటీవల సంఘమిత్ర మునీశ్వరి స్త్రీనిధి చెక్కులను విత్ డ్రా చేసి ఇవ్వాలని నిర్మల కుమారి ని అభ్యర్థించగా ఆమె స్థానిక ఎస్బీఐ బ్యాంకు వెళ్లి విచారించగా అసలు నిజం బయటపడింది. గ్రూపులో అయితే తొలగించారు గాని బ్యాంకులో పేర్లు అలానే కొనసాగిస్తూ నగదు లావాదేవీలు జరుగుతున్నట్లు తెలిసింది.

ఎంపీపీ భర్తపై చర్యలు చేపట్టాలి

వెలుగు సమాఖ్యలో ఫోర్జరీ సంతకాలు , గ్రామ సమాఖ్య అధ్యక్షుల సంతకాలు లేకనే నగదు లావాదేవీలు ఎలా జరిపారని వివరణ కోరేందుకు కార్యాలయం వెళ్లిన విమల కుమారిపై ఎంపీపీ భర్త దామోదర్ రెడ్డి అనుచితంగా ప్రవర్తించాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. సంతకాలు లేకనే నగదు విత్ డ్రా చేయవచ్చని ఏపీఎం చెప్పారని, ఇక నువ్వెళ్లని ఎంపీపీ భర్త హేళనగా మాట్లాడటం జరిగిందని ఆమె వాపోయింది. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారమనే కారణంగానే పదిమందిలో అగౌరవంగా, మనోవేదనకు గురయ్యే విధంగా అనుచితమైన మాటలతో క్షోభకు గురిచేశారని, సదరు ఎంపిపి భర్తపై చర్యలు చేపట్టాలని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

మునీశ్వరిని ఇదివరకే సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు

సంఘ మిత్ర మునీశ్వరి మహిళా గ్రూపు సభ్యుల ను బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే విషయంలో ఉన్నతాధికారులు మూడు నెలలు సస్పెండ్ చేయడం జరిగింది. తాజాగా ఇందిరానగర్ లో ఇదే సంఘమిత్ర మునీశ్వరి సంఘంలో తొలగించిన వారి పేర్లు బ్యాంక్ అకౌంట్లో మార్చకుండా వారి పేరుపైనే సంతకాలు ఫోర్జరీ చేసి దాదాపు రూ.30 లక్షలు చెక్‌ల లావాదేవీలు జరిగినట్లు మహిళా ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చింది.

బ్యాంకు అధికారుల తీరుపై అనుమానాలు

చెక్కులు క్లియరెన్స్‌కి వచ్చినప్పుడు గ్రూపులోని అధ్యక్షురాలు సంతకం లేకుండా గడచిన రెండు సంవత్సరాల లో నగదు ఎలా ఇచ్చారు. ఒకవేళ అధ్యక్షురాలు సంతకం ఉంటేనే నగదు ఇచ్చామని బ్యాంకు అధికారులు చెబితే గ్రూపు అధ్యక్షురాలుగా తొలగినప్పటి నుండి తాను చెక్కుల్లో సంతకం పెట్టలేదని నిర్మల కుమారి చెబుతున్నారు. అంటే బ్యాంక్ అధికారులు సంతకాలని క్రాస్ చెక్ చేసుకోకుండా చెక్కు పై సంఘం ముద్ర వేసిన సీల్ ను చూసి మాత్రమే నగదు ఇచ్చినట్లు అర్థమవుతుంది. ఈ విషయంపై బ్యాంక్ అధికారులు స్పందించాల్సి ఉంది.

దర్యాప్తుతో మరోసారి అక్రమాలు

ఏదిఏమైనా వెలుగు అక్రమాలు వరదయ్యపాళెం మండల వాసులను ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. స్వయం సహాయక మహిళా పొదుపు సంఘాల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపాలు, స్థానిక రాజకీయ నేతల అండదండలు ఉన్నాయనో దర్జాగా అక్రమాలు సాగిపోతూ వెలుగు సమాఖ్యను చీకట్లు కమ్ముకునేలా సంఘటనలు పరిణమిస్తున్నాయని స్థానిక వాసులు ఆరోపిస్తున్నారు. వెలుగు సమాఖ్య మహిళా సభ్యుల జీవితాల్లో వెలుగులను నింపాల్సి ఉండగా కొందరి స్వార్థపూరిత వ్యవహారాల నేపథ్యంలో అంధకారంగా మారుతోందని తెలుస్తుంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.

వైభవంగా మాతమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మున్సిపాలిటీలోని ఈసలాపురంలో మాతమ్మ కొలుపు వైభవంగా జరుగుతోంది. ఆదివారం సాయంత్రం మాతమ్మకు పొంగల్లు పెట్టి అగ్నిగుండ ప్రవేశం చేశారు. అమ్మవారిని గ్రామ పురవీధులలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దగొల్ల రామయ్య మందడి, పినపెద్ద శేఖర్, పెద్దకాపు హరి, పూజారి మునిశేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

గంగజాతర వేడుకలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం ఎస్వీపురం పంచాయతీ కేఆర్ కొటాల గ్రామంలో గంగజాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఐటీయూ సభలు జయప్రదం చేయాలి



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: తిరుపతిలో సిఐటియు ఆధ్వర్యంలో జరిగే సభలను కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి దాసరి జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో తిరుపతిలోని రామ తులసి కళ్యాణ మండపంలో జరిగే బహిరంగ సభకు సత్యవేడు నియోజకవర్గంలోని ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, హమాలీ, బిల్డింగ్ వర్కర్స్, గ్రీన్ అంబాసిడర్లు, ఆటో, ఇతర అసంఘటిత కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అంకాలమ్మను దర్శించుకున్న పవిత్ర రెడ్డి

ప్రజాశక్తి -తొట్టంబేడు: తొట్టంబేడు మండలంలోని పొయ్య పంచాయతీ గాపచేను గ్రామ దేవత శ్రీశ్రీ అంకాలమ్మ తల్లి జాతర సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్ర రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమెకు మండల ఎంపీపీ ఉన్నం నిర్మల, మండల అధ్యక్షులు వాసుదేవ నాయుడు ఘన స్వాగతం పలికి శేష వస్త్రంతో సత్కరించి అమ్మవారి దర్శనం ఏర్పాట్లు నిర్వహించారు. అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకుని ముక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడి వాళ్ళ సమస్యలను అడిగి తెలుసుకుని సమస్యలను పరిష్కరించే దిశగా ఎమ్మెల్యే తో మాట్లాడి పరిష్కరిస్తానని గ్రామస్తులకి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సక్కుబాయమ్మ, ఆమె కుమారుడు మణి, మోహన్, గోపి నాయుడు, నరసింహులు, లీల, ప్రసాద్, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మహాభారత యజ్ఞంలో దుర్యోధన వధ ఘ ట్టం చూపరులను ఆకట్టుకుంది. ఆదివారం ఈ ఉత్సవాలలో చివరి రోజు దుర్యోధన వధ ఘట్టంతో మహాభారతం ముగుస్తుంది. దుర్యోధనని గంగ మడుగులో ఉండగా భీమసేనుడు నానా దు ర్భాషలాడి బయటకు లాక్కొని వచ్చే ఘట్టం స్థానికులను ఎంతగానో ఆకర్షించింది. పాత్రధారులు తమ అభినయంతో ఇతిహాస పద్యా లతో చూపరులను సైతం కంటతడి పెట్టించే విధంగా రక్తి కట్టించా రు. రాత్రి 7 గంటలకు అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. మాజీ సైనిక ఉద్యోగి బండి పరమేశ్వర్ రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వైసీపీ ప్రభుత్వంలోనే బీసీలకు సమన్యాయం

ప్రజాశక్తి-రేణిగుంట: వైసీపీ ప్రభుత్వంలోనే బీసీలకు సమన్యాయం జరుగుతోందని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం రేణిగుంటలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మొదటగా వన్నెరెడ్డి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన 20 ఏళ్ల సర్వీసులో ఏ పార్టీ వన్నెకుల రెడ్డిలకు తగిన గుర్తింపు ఇవ్వలేదని.. తాను గతంలో తెలుగుదేశం పార్టీలో చాలా కష్టపడ్డానని.. అయినా గుర్తింపు లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బీసీలను గుర్తించి వన్నెరెడ్డి కులస్తుడైన తనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చినందుకు తాను పార్టీకి విధేయుడిగా పని చేస్తానన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి తమ వన్నెరెడ్డి కులస్తులు కషి చేస్తామని..డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వన్నె రెడ్డి కులస్తులు సుమారు 200 మంది వైసీపీలో చేరారు. కార్యక్రమంలో వైసీపీ రేణిగుంట మండల ఇన్‌ఛార్జి పవిత్రరెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, జడ్పీటీసీ ఛైర్మన్ సంధ్య, బాలాజీ రెడ్డి, సర్పంచ్ నగేష్, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు రసూల్, గంగమ్మ గుడి ఛైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, రత్నంరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-ఓజిలి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందుతున్నాయని సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. మండలంలోని అత్తివరం సచివాలయం పరిధిలోని అత్తివరం, కారూరు గ్రామాల్లో సర్పంచ్ సాలి రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొని ప్రతి గడపగడపకు తిరుగుతూ సంక్షేమ పథకాలు అమలుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కుందాం సహకార సంఘం మాజీ అధ్యక్షులు కనుమూరు గోపాల్ రెడ్డి, వైసీపీ మాజీ మండల కన్వీనర్ జరుగుమల్లి బాబురెడ్డి, జడ్పీటీసీ సభ్యులు గుంటమడుగు రవీంద్రరాజు, కో ఆప్షన్ మెంబర్ షేక్ ఖాదర్ బాషా, అమరేంద్రనాథ్, గురుమూర్తి, ప్రతాప్ రెడ్డి, దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఉచ్చూరు హరినాథ్‌రెడ్డి, పాదర్తి హరినాథ్ రెడ్డి, దామోదరరాజు, సుబ్బారావు యాదవ్ , మహేంద్రరెడ్డి, ఎంపీడీవో రజనీకాంత్ , సీఐ సోమయ్య, ఎస్సై ఆదిలక్ష్మి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆచార్య జయశంకర్‌కు థాయ్ ఫిజిక్స్ సొసైటీ ఆహ్వానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్ర ఆచార్యుడిగా పనిచేసి, దేశ విదేశాల్లో సుప్రసిద్ధ శాస్త్రవేత్తగా గుర్తింపు పొందిన ఆచార్య సికె. జయశంకర్ ను అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానిస్తూ థాయ్ సొసైటీ ఆఫ్ ఫిజిక్స్ ఆహ్వానం పంపింది. ఈ నెల 14 నుంచి 16 వరకు జరిగే సదస్సులో " ఆప్టిక్స్ అండ్ ఫోటానిక్స్ ఇన్స్టుమెంటేషన్స్ "అనే అంశంపై వారిని ప్రసంగించవలసిందిగా నిర్వాహకులు కోరారు. ఈ సదస్సు థాయిలాండ్ లోని ఛియాంగ్ మై లో జరగనున్నట్లు జయశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి, కులసజీవులు ఆచార్య ఓఎండి హుస్సేన్ ఆచార్య జయశంకర్ కు అభినందనలు తెలిపారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఆచార్య తులసి రామకష్ణారెడ్డి, ఆచార్య దేవ ప్రసాద్ రాజు, ఆచార్య విజయలక్ష్మి, ఆచార్య అపర్ణ, ఆచార్య రాజగోపాల్ రెడ్డి, డాక్టర్ రాణి రుద్రమదేవి, పరిశోధకులు, విద్యార్థులు, శుభాకాంక్షలు తెలిపారు.

మోహిత్‌రెడ్డి పాదయాత్ర విజయవంతం

ప్రజాశక్తి-పాకాల: చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించి పాదయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పాకాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా ప్రతి ఇంట్లో మోహిత్ రెడ్డిని పరిచయం చేయాలని.. ప్రజలకు దగ్గరగా ఉన్నపుడే నాయకునిగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే ప్రతి పంచాయతీకి రూ.2 కోట్లు తక్కువ లేకుండా కేటాయించడం జరిగిందని, అర్హత కలిగిన కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. జగనన్న సంక్షేమ పథకాలు, తుడా అభివద్ధి పనులతో ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లగలిగే సామర్థ్యం ఉందని.. నాలుగేళ్ల పాటు గ్రామాల్లో మనం చేసిన అభివద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. హెల్త్ చెకప్‌ల అనంతరం రిపోర్ట్‌ల మేరకు అంతటా మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తామని... ఇప్పటికే చంద్రగిరి నియోజకవర్గంలో ఎక్కడ పెళ్లి జరిగినా పెళ్లి కానుకలను పంపుతున్నామని తెలిపారు. మార్కెట్‌లో ఉచితంగా క్రయ విక్రయాలు సాగించే వెసులుబాటు కల్పించామని.. విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో ఆదుకునే విషయంలో ప్రయత్నలోపం లేకుండా కషి చేస్తున్నామన్నారు. కులమత, రాజకీయ పార్టీలకు అతీతంగా చేసిన సేవలను ప్రతిఒక్కరూ గుర్తిస్తారని తెలిపారు. ప్రజలందరూ బాగుండాలని ఆదాయంలో 75శాతం ఖర్చు చేస్తున్నానని..అభివద్ధిని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పైకప్పు పెచ్చులు పడి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని దినసరి కూరగాయల మార్కెట్ మున్సిపల్ కాంప్లెక్స్ భవనంలో పైకప్పు పెచ్చులూడి పడి ఆదివారం ఉదయం నాగేశ్వరరావు అనే వ్యక్తి తలపై పడటంతో తీవ్రగా గాయపడ్డాడు. అధికారులు భవనాలను పరిశీలించి పూర్తి మరమ్మతులు చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

లగేజ్ ఆటో ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని గంగమ్మ గుడి వద్ద ఉన్న జంజం రెస్టారెంట్ వద్ద ఆదివారం ఆటో ఢీకొని నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో ఆటోలోని వసంతమ్మ, ఏర్పేడు మండలం గోవిందపురం చెందిన గోవిందు, చంద్రగిరి మండలం కాలూరు క్రాస్ కి చెందిన కిరణ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. 108 అంబులెన్స్ లో తిరుపతి రుయాకి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు.

గుంటి రాజేష్‌గాంధీకి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మైక్రోబయాలజీ పరిశోధక విద్యార్థి గుంటి రాజేష్ గాంధీకి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎం. దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య సిహెచ్. పరమగీతం మార్గ దర్శకత్వంలో " ఇన్ఫ్లూయన్స్ ఆఫ్ ఫిజికో కెమికల్ పారామీటర్స్ ఆన్ లిపిడ్ కంటెంట్ ఆఫ్ ఫోర్ మెరైన్ ప్లాంటోనిక్ డయాటం స్పెసెస్ ఫర్ బయో డీజిల్ ప్రొడక్షన్ " అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వివరించారు. రాజేష్ పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధన వ్యాసాలను ప్రచురించినట్లు వివరించారు. గుంటి రాజేష్ గాంధీకి డాక్టరేట్ డిగ్రీ రావడంపై పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

పలువురి అభినందనలు

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ప్రముఖ జ్యోతిష్యులు, రాష్ట్ర నంది అవార్డు గ్రహీత చక్రధర్ సిద్ధాంతికి డాక్టరేట్‌ను ఢిల్లీలో ఆదివారం ప్రదానం చేశారు. ఈ నేపథ్యం లో ఆయన జ్యోతిష్య పరమైన అవార్డు సైతం పొందారు. ఆయ న వెదురుకుప్పం మం డలం గొడుగుచింత నివాసి కావడం మనందరికీ గర్వకారణమని గ్రామస్తులు కొనియాడారు. ఈ సందర్భంగా స్నేహితులు, పలువురు నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

పుంగనూరులో వర్గపోరుతో ఆగిన ఉరుసు

ప్రజాశక్తి-పుంగనూరు: మతసామరస్యానికి ప్రతీకగా పుంగనూరు పట్టణంలో ఉరుసు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా గత కొన్ని ఏళ్లగా నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఏడాది వర్గ పోరుతో ఉరుసు కార్యక్రమాన్ని చేపట్టలేకపోయారని పట్టణం లో పలు రకాలుగా విమర్శలు వినిపిస్తున్నాయి. పుంగనూరు పట్టణంలో ఐక్యతకు ప్రతీక ఉరుసు నిర్వహిస్తున్న చరిత్ర ఉన్నది. రంజాన్ మాసం తర్వాత ఉరుసును నిర్వహించే వారు. అయితే ఉరుసు దర్గా కమిటీని నూతనంగా ఏర్పాటు చేయడంతో అందులో కమిటీ మెంబర్లందరూ ఒకే గ్రూపుకు చెందిన వారు ఉన్నారని పలువురు చెబుతున్నారు. గతంలో ఉన్న ఉరుసు కమిటీలో ఓ గ్రూపుకు చెందినవారు, అటు మరో గ్రూపుకు చెందినవారు రెండు గ్రూపులు కలిసి ఉండే వారిని పలు మైనార్టీ వర్గాలు తెలిపారు. ప్రస్తుతం ఏర్పడిన నూతన కమిటీలో ఒకే గ్రూపుకు చెందినవారు ఉరుసు కమిటీ సభ్యులుగా ఉన్నారని దీంతో కొంతమేర వివాదాలతో ఈ ఏడాది ఉరుసు కార్యక్రమాన్ని నిర్వహించలేకపోయారు. దీంతో పట్టణంలో ఉరుసుపై మైనార్టీ నేతల చర్చ నడుస్తుంది. మూడు రోజులపాటు జరిగే ఉరుసు కార్యక్రమం అత్యంత వైభవంగా స్థానిక నానాస పేట కళాశాల గ్రౌండ్లో నిర్వహిస్తారు. గతంలో ఉన్న ఉరుసు కమిటీలో మెజారిటీ సభ్యులు ఒకే గ్రూపుకు చెందిన వారిని ప్రస్తుతం నూతన కమిటీలో కమిటీ సభ్యులందరూ మరొక గ్రూపుకు చెందిన వారని దీంతో ఇరు వర్గాల మధ్య పొంతన కుదరకపోవడంతో ఉరుసు కార్యక్రమం నిర్వహించలేకపోయారని చర్చ పట్టణంలో నడుస్తుంది. దర్గా ఉరుసు కార్యక్రమాలలో కూడా వర్గ పోరు లేకుండా ఉండాలని పలువురు చర్చించుకోవడం విశేషం.

శ్మశానానికి దారి కల్పించండి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని గంగినాయన పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొత్త ఇండ్లు, వడ్డి ఇండ్లు గ్రామాల ప్రజలు తరతరాలుగా ఉన్న శ్మశాన వాటికకు నూతనంగా నిర్మిస్తున్న హైవే రోడ్డు అడ్డు కావడంతో రెండు గ్రామాల ప్రజలు మరణించిన తర్వాత ప్రశాంతంగా కుటుంబ సభ్యులు ఖననం చేయడం ఇబ్బందిగా మారుతుందని, నూతనంగా నిర్మిస్తున్న హైవే రోడ్డు పనుల వద్దకు రెండు గ్రామాల ప్రజలు ఆదివారం చేరుకున్నారు. శ్మశాన వాటికకు దారి వేసేవరకు హైవే రోడ్డు పనులు అడ్డుకుంటామని గ్రామస్తులు తెలపడంతో అక్కడికి చేరుకున్న అధికారి తహశీల్దార్‌ను చరవాణిలో విచారణ కోరగా ఉన్నతాధికారులతో మాట్లాడి శ్మశాన వాటికకు దారి కల్పించేలా చర్యలు చేపడుతామని తహశీల్దార్ హామీ ఇవ్వడం జరిగింది. దీన్ని గమనించిన గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఉత్తరం వైపు 200 మందికి పైగా రైతులు పంట పొలాలకు వెళ్లాలంటే అటువైపే వెళుతున్న గడ్డ ఇండ్లు, శెట్టి పల్లి గ్రామానికి ఈ దారి వెంటే వెళ్లాల్సి వస్తుంది. ఇది గమనించుకొని ఉన్నత అధికారులు వెంటనే దారి సౌకర్యం కల్పించాలని తెలియపరిచారు. తహశీల్దార్‌తో చరవాణి ద్వారా మాట్లాడిన విషయం తెలుసుకొని రెండు గ్రామాల ప్రజలు వెనుదిరిగి గ్రామానికి చేరుకున్నారు. దారి కల్పించకపోతే తహశీల్దార్ ఆఫీ సును ముట్టడిస్తామని రైతులు, గ్రామ ప్రజలు హెచ్చరించారు. అధికారులు స్పందించి శ్మశాన వాటికకు దారి కల్పించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.